సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 9 । మార్చి । 2024



చేయూత పండగ

రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా సీఎం జగన్ చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. 8లో ▸



ముగ్గురి మృతి

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు యువకులు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలైన ఘటన ఆచంట శివారులో చోటుచేసుకుంది. 8లో ▸



నృసింహ మహాయజ్ఞం

సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రంలో రుద్ర సుదర్శన సహిత నృసింహ మహాయజ్ఞం నేత్రపర్వంగా సాగుతోంది. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు గూడెంలో తిరుమల శ్రీవారి కల్యాణం



ఏర్పాట్లను పర్యవేక్షించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యవేక్షణలో రెండు నెలలుగా సాగుతున్న ధర్మ ప్రచార మహోత్సవంలో భాగంగా శనివారం తిరుమల శ్రీనివాస కల్యాణాన్ని బలుసులమ్మ ఆలయ సమీప ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు మరో 40 మంది రుత్వికులతో కలిసి శుక్రవారం ఇక్కడకు చేరుకున్నారు. తిరుమలలో మాదిరి వేకువజాము నుంచి ఇక్కడ పూజాదికాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 7.30 వరకు సుప్రభాత సేవ, ఉదయం 8 గంటల నుంచి 9.30 వరకు అభిషేక అలంకారం, ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు తోమాల సేవ, ఉదయం 10.30 నుంచి 10.45 వరకు కొలువు, ఉదయం 10.45 నుంచి 11.45 వరకు సహస్రనామార్చన, ఉదయం 11.15 నుంచి 11.30 వరకు నైవేద్యం, కర్పూర నీరాజనం, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను మంత్రి కొట్టు పర్యవేక్షించారు.

లారీ లడ్డూలు : తిరుమలలో మాదిరి శ్రీవారి కల్యాణ్యాన్ని ఇక్కడ నిర్వహించనున్నామని మంత్రి కొట్టు తెలిపారు. ఇలాంటి అవకాశం మరలా రాకపోవచ్చని అన్నారు. తిరుమల నుంచి లారీ లడ్డూలు తీసుకువస్తున్నామని, అలాగే తిరుచానూరు నుంచి పది వేల లడ్డూలు తీసుకొచ్చి భక్తులకు వితరణ చేస్తామని, ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.


ఉమాసిద్దేశ్వరుని సన్నిధిలో మంత్రి కారుమూరి



అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: స్థానిక ఉమాసిద్దేశ్వరస్వామిని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రంభ సూరిబాబు, ట్రస్టుబోర్డు చైర్మన్ బండి అంజన్న, ఈఓ ఆకుల వెంకట నారాయణ పాల్గొన్నారు.

నూజివీడులో డయేరియా మరణాలు లేవు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్‌మోహన్‌రావు

నూజివీడు: నూజివీడు పట్టణంలో ఎవరూ డయేరియాతో మరణించలేదని, పలు పత్రికల్లో వచ్చిన కథనాలు అవాస్తవమని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు తెలిపారు. స్థానిక బంగినపల్లితోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల షేక్ జాన్‌బీ, మద్దిరాల తాతయ్యబాబు డయేరియాతో మరణించలేదని, వారిద్దరూ హార్ట్ ఎటాక్‌తోనే చనిపోయారన్నారు. జాన్‌బీ గుండె బరువుగా ఉందని కుటుంబ సభ్యులకు తెలపగా వారు ఆర్‌ఎంపీని తీసుకువచ్చి గ్యాస్ ట్రబుల్‌కు ఇంజక్షన్ చేయించారని, దీంతో ఆమె వేకువజామున నిద్రలోనే చనిపోయిందన్నారు. తాతయ్యబాబు గుండెపోటుతో చనిపోయాడని, ఈ విషయాన్ని ఆయనకు వైద్యం చేసిన విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారన్నారు. పట్టణంలో రొయ్యలు, చికెన్, చేపలు తినడం వల్ల నలుగురు, ఐదుగురికి విరేచనాలు అయ్యాయని, అది డయేరియా కిందకు రాదన్నారు. అయినా వైద్యారోగ్య సిబ్బంది 1,300 ఇళ్లకు వెళ్లి సర్వే చేయగా ఎక్కడా విరేచనాల కేసులు రాలేదన్నారు. అలాగే పట్టణంలోని వాటర్ ప్లాంట్ల నుంచి నీటి శాంపిళ్లను తీసుకుని పరీక్షలకు పంపిస్తున్నామన్నారు.

వందే శివం.. శంకరం



మహా ప్రాణ దీపం.. శివం శివం.. మహా దివ్య తేజం.. శివం శివం.. అంటూ నీలకంఠుడి సేవలో భక్తులు తరించారు.. హరహర మహాదేవ శంభోశంకర.. వందే శివం శంకరం.. స్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి.. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్నసమారాధనలు పెద్దఎత్తున జరిగాయి.



భీమవరం (ప్రకాశం చౌక్): ఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరునికి అభిషేకాలు

పంచారామం.. మోక్షధామం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి అభిషేకాలు ప్రారంభమయ్యాయి. రాత్రి 8.35 గంటలకు జగజ్జ్యోతి వెలిగించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామివారికి మల్లన్న పాగా అలంకరించారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సుమారు 60 వేల మంది భక్తులు స్వామిని దర్శించినట్టు అంచనా. భక్తులకు క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు, దాతలు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయం బయట క్యూలైన్‌లలో భక్తులు రేపాక వారి సత్రం వరకు వేచి ఉన్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భీమవరంలో..

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం) శివనామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచి అర్చకుల బృందం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో కొలువైన పార్వతీ దేవి, అన్నపూర్ణ దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు అంచనా. దేవస్థానంతో పాటు ఆలయం బయట భక్తులు కిక్కిరిశారు. స్వామి వారిని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ముసునూరు: బలివేలో జల్లుస్నానాల వద్ద భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) **పోలవరం రూరల్:** పట్టిసంలో వీరేశ్వరునికి అభిషేకాలు

వీరంపాలెం.. భక్తజన సంద్రం



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం క్షేత్రాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరీ ఆధ్యాత్మిక పీఠం భక్తజన సంద్రంగా మారింది. వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయంలో విశ్వేశ్వరుడిని, స్ఫటిక లింగాన్ని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. తొలుత పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో స్ఫటిక లింగానికి మానస సరోవర జలాలు, 12 రకాల నదీ జలాలు, 12 రకాల మంగళ ద్రవ్యాలతో మహాలింగానికి అభిషేకాలు చేశారు. హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ దంపతులు పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. దోర్బల ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో 15 మంది వేద పండితులు హోమాలు చేశారు. రిటైర్డ్ హైకోర్టు జడ్జి కేసీ బాబు, అడ్వకేట్ జనరల్ ప్రసాద్, రిటైర్డ్ సీబీఐ జడ్జి నాగమారుతీ శర్మ, జిల్లా ఎస్పీ అజిత తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

బలివే.. భక్త పరవశం

ముసునూరు/పెదవేగి: బలివేలోని బలే రామలింగేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం అర్ధరాత్రి నుంచి ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. శుక్రవారం వేకువజామున అర్చకులు స్వామికి విశేష అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. భక్తులు తమ్మిలేరు, జల్లుస్నానాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండ ప్రదానాలు చేయించి తర్పణలు వదిలారు. స్వామి దర్శనం కోసం ఆలయం మూడు వైపుల నుంచి భక్తులకు ప్రవేశం కల్పించారు. స్వామివారిని ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కొఠారు అబ్బయ్య చౌదరి, పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తదితరులు దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీళ్లు అందజేశారు. వైద్యారోగ్యశాఖ శిబిరంలో 620 మందికి వైద్య పరీక్షలు చేశారు. పటిష్ట భద్రతా చర్యలతో జేబు దొంగతనాలు నివారించినట్టు ఎస్సై పి.వాసు తెలిపారు. అధికారులు, గ్రామ పంచాయతీ కృషితో ఉత్సవాలు విజయవంతమైనట్టు సర్పంచ్ రావు ప్రవీణ, చైర్మన్ నాగేశ్వరరావు, ఈఓ సతీష్ కుమార్, తహసీల్దార్ జవహర్‌బాజి తెలిపారు.



బలివేలో పెద్దలకు పిండ ప్రదానాలు



బలే రామలింగేశ్వరస్వామి

పట్టిసం.. పావన క్షేత్రం

పోలవరం రూరల్: అఖండ గోదావరి మధ్యలో స్వయంభూగా వెలిసిన భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి క్షేత్రం శివనామస్మరణలతో మార్మోగింది. గోదావరి తీరం భక్తజన సంద్రమైంది. గురువారం అర్ధరాత్రి వంశపారంపర్య ధర్మకర్త, కుటుంబసభ్యులు స్వామివారికి తొలిపూజలు చేశారు. క్షేత్రంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. వేకువజాము 2 గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనాన్ని కల్పించారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణలు వదిలారు. సుమారు లక్ష మంది భక్తులు ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ ఆలయానికి తరలివచ్చినట్టు అంచనా. మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. పట్టిసం రేవులో దాతలు అన్నసమారాధనలు చేశారు. భక్తులకు పులిహోర, మజ్జిగ, తాగునీరు ప్యాకెట్లు పంపిణీ చేశారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీఓ కె.అద్దయ్య, డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి రేవులో మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానం వద్ద ఈఓ ఎస్.సంగమేశ్వరశర్మ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హోం మంత్రి తానేటి వనతి, ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఐటీడీఏ పీఓ సూర్యతేజ స్వామిని దర్శించుకున్నారు.



పోలవరం రూరల్: పట్టిసంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి



పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రం వద్ద గోదావరిలో స్నానమాచరిస్తున్న భక్తులు

పారిశ్రామిక ప్రగతి

- ఐదేళ్లలో నిరుద్యోగులకు ఉపాధి
- చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సాయం
- 1,407 పరిశ్రమలకు అనుమతి
- రూ.18.55 కోట్ల పెట్టుబడి రాయితీ
- 'బడుగు వికాసం' ద్వారా ఎస్సీ, ఎస్టీలకు సాయం



పారిశ్రామిక విధానం.. ఔత్సాహికులకు ప్రోత్సాహం: పరిశ్రమను తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు (మెట్రో): పారిశ్రామిక రంగంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో యువత అభివృద్ధి బాటలో పయనిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పారిశ్రామిక విధానానికి కొత్త భాష్యం చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తూ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశ్రామిక వేత్తలను మరింతగా ప్రోత్సహిస్తోంది.

ఎన్నడూ లేనివిధంగా.. గత ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఐడీపీ పాలసీ విధానాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు భూములు, యంత్రాలకు రాయితీలు అందించేలా చర్యలు తీసుకుంది. అర్హతల మేరకు పెట్టుబడి రాయితీని అందిస్తోంది. ఇలా నూతన ఐడీపీ విధానం ద్వారా ఐదేళ్ల కాలంలో 211 పరిశ్రమలకు రూ.18.55 కోట్లు పెట్టుబడి రాయితీని ప్రభుత్వం అందజేసింది.

బడుగు వికాసం.. పీఎంఈజీపీ

- వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ పారిశ్రామికవేత్తలకు 235 యూనిట్లకుగాను రూ.18.73 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 36 యూనిట్లకు రూ.3.75 కోట్లను పలురకాల ప్రోత్సాహకాల కింద ప్రభుత్వం అందజేసింది.
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పారిశ్రామికీకరణ ప్రోత్సాహంలో భాగంగా ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) ద్వారా 356 యూనిట్లకు 220 యూనిట్లను మంజూరు చేసింది. రూ.1,032.66 లక్షలను బ్యాంకుల ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అందించే ఏర్పాట్లు చేసింది.

సింగిల్ విండో విధానం

- ఐదేళ్లుగా సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు.
- ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 1,448 దరఖాస్తులు రాగా 1,407 దరఖాస్తులను ఆమోదించారు.
- 35 దరఖాస్తులను తిరస్కరించగా, ఐదు దరఖాస్తులను వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు.

మూతపడిన పరిశ్రమలను తెరిపించేలా..

- మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు వారి సమస్యలను పరిష్కరించి పునః ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 373 యూనిట్లను క్రమబద్ధీకరిస్తూ రూ.43.45 కోట్ల లబ్ధి చేకూర్చింది.
- 65 మంది ఎస్సీ పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను రూ.5.58 కోట్లతో పునరుద్ధరించగా, ఎస్టీ పారిశ్రామికవేత్తల 7 యూనిట్లను రూ.69 లక్షలతో పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- ఇలా పారిశ్రామికవేత్తలు దినదినాభివృద్ధి చెందేందుకు, నూతన పరిశ్రమలను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

అన్ని అనుమతులూ ఒకేచోట



ఏకగావక్ష విధానం ద్వారా పరిశ్రమలకు అన్ని అనుమతులు ఒకే దరఖాస్తు ద్వారా మంజూరు చేస్తున్నాం. ఐదేళ్లలో జిల్లావ్యాప్తంగా 1,448 దరఖాస్తులు రాగా 1,407 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం పలు విధాలుగా పారిశ్రామిక విధానంలో రాయితీలు అందిస్తూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోంది.

– వి.ఆదిశేషు, జిల్లా పరిశ్రమల అధికారి, ఏలూరు

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

పెదపాడు: చెరువులో పడి ఓ వ్యవసాయ కూలి మృతి చెందిన ఘటన మండలంలోని వట్లూరులో చోటు చేసుకుంది. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామానికి చెందిన వసంతవాడ ఏడుకొండలు(52) వ్యయసాయ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తుంటాడు. ప్రతి రోజూ తమ గేదెలను వట్లూరులోని పెద్ద చెరువులో గేదెలు దింపి వాటిని కళిజీగుతుంటాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం గేదెలను కడుగుతూ ప్రమాదశాత్తూ చెరువులో పడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం చెరువులో మృత దేహం తేలడంతో వీఆర్వోలు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృత దేహాన్ని బయటకు తీయించి ఏలూరు ప్రభుత్వా సుపత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు.

దళితుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

భీమడోలు: దళితుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్సీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు కట్టిపోగు బసవరావు అన్నారు. వై నాట్ 175కు మద్దతుగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు బసవరావు తన బృందంతో చేస్తున్న పాదయాత్ర శుక్రవారం భీమడోలు చేరుకుంది. ఈ పాదయాత్రకు జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ రంగ ఆధ్వర్యంలో నాయకులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజానాయకుడు జగనన్నకు మన ఓట్లు వేసి గెలిపించాలన్న ఏకైక నినాదంతో పాదయాత్ర చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ జిల్లా నాయకులు పాము మాన్‌సింగ్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శి అంబటి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

పోలవరం రూరల్: మండలంలోని గూటాల పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మీదేవిపేట సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మహా శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పట్టిసం వస్తున్న యువకుల మోటార్‌సైకిల్, పట్టిసం నుంచి వెళుతున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాజమండ్రి వైద్యశాలకు తరలించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మది నిండుగ.. చేయూత పండుగ

- చేయూతతో మహిళలకు ఆర్థిక భరోసా
- నాలుగో విడత చేయూత లబ్ధి మహిళల ఖాతాల్లో జమ
- 85105 మందికి 159.57 కోట్ల జమ
- నాలుగో విడతల్లో 552.78 కోట్ల అందజేత



జిల్లా కలెక్టర్ చేతుల మీదగా చేయూత చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)



వేల్పూరులో చేయూత మహిళ మార్ట్

జిల్లా వ్యాప్తంగా విడతల వారీగా చేయూత వివరాలు		
ఏడాది	లబ్ధిదారులు	ఖర్చు రూ కోట్లల్లో
2020–21	64,937	రూ.119.12
2021–22	64546	రూ.118.32
2022–23	84,523	రూ.155.77
2023–24	85105	రూ.159.57

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలే లబ్ధిదారులుగా అనేక సంక్షేమ పథకాలు ఈ 5 ఏళ్లల్లో పాలనలో అమలు చేసింది. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ చేయూత పథకం నాలుగు విడతలు పూర్తి చేసి మహిళా పక్షపాతిగా నిలిచారు. 45 ఏళ్ల దాటిని ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18750 చొప్పున నాలుగు విడతాల్లో రూ.75 వేలు అందించి వారిని ఆర్థికంగా అదుకుని వారి చేత వ్యాపారాలు చేయించి ఉపాధి పొందేలా చేశారు. ఇప్పటికే మూడు విడతల చేయూత లబ్ధి లబ్ధిదారులకు అందించగా తాజాగా నాలుగో విడత లబ్ధిన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో చేయూత పథకం నాలుగో విడత కింద 85105 మంది లబ్ధిదారులకు రూ 159.57 కోట్లు జమ చేయడం జరిగింది.

14 రోజుల పాటు యూత కార్యక్రమాలు

జిల్లాలో చేయూత పథకం నాలుగో విడత పంపిణీ కార్యక్రమాలను 14 రోజుల పాటు పండగ వాతవారణం మాదిరిగా చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో చేయూత పంపిణీ కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యేలు, మంత్రులు స్థానిక ప్రజాప్రతినిధుల పాల్గొనేలా చూడాల్సి ఉంటుంది. చేయూత పథకం ఉపయోగించుకుని వ్యాపారాలు చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడించాలి.అలాగే వ్యాపారాలు చేస్తున్న మహిళలు వారి ఉత్పత్తుల కంపెనీ పార్టనర్స్, బ్యాంకర్స్‌తో స్టాల్స్ ఏర్పాటు చేయడం జిల్లా, మండల స్థాయిలో చేయాలి. వైఎస్సార్ చేయూత నాలుగు విడతలగాను జిల్లా 2,72,111 మంది లబ్ధిదారులకు గానూ రూ.552.78 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేశారు. ఇందులో నాలుగో విడత 85105 మంది లబ్ధిదారులకు రూ.159.57 కోట్లు ఖర్చు చేశారు.

సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులు

ప్రభుత్వం అందించి చేయూత ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకున్నారు. సాధారణ టిఫిన్ సెంటర్ దగ్గర నుంచి చేయూత మార్ట్ వరకు వ్యాపార యూనిట్‌లు పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు. గ్రూపు వ్యాపారాలు, వ్యక్తిగత వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి ఆసరా నిలుస్తున్నారు. 45 ఏళ్ల వయస్సులో ఏ ఆధారం లేని వారు వారు మరో ఒకరిపై ఆధారపడకుండా ఆఖరికి కొడుకులు, కూతుళ్లపై ఆధారపడకుండా చేయూత ఆర్థిక సాయంతో వ్యాపారా, ఆరోగ్య, కుటుంబ ఆసరాలకు ఉపయోగించుకుని వారి కాళ్ల మీద వారు నిలబడ్డారు.

కుటుంబానికి ఆసరా



ఈమె పేరు ఎ.జయలక్ష్మి, భీమవరం పట్టణం 2 వార్డుకు చెందిన మధ్యతరగతి గృహిణి. గతంలో ఆమె భర్త సంపదనతో మాత్రమే కుటుంబం గడిచేది. కుటుంబాల ఆసరాలకు ఇబ్బందులు ఉండేవి ఈ నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేసిన చేయూత పథకంలో అర్హత పొంది ప్రభుత్వం అందించిన ఏడాదికి రూ.18750 ఆర్థిక సాయంతో కిరాణ, ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ పెట్టుకుంది. గత మూడేళ్లగా చేయూత లబ్ధితో ఆమె వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరా నిలిచిస్తుంది. ఈ ఏడాది నాలుగో విడతతో రూ.75 వేలు రూపాయలు అందుకుని వ్యాపారం అభివృద్ధి చేసుకొనుంది.

చేయూతతో ఉపాధి



భీమవరం 3 వార్డుకు చెందిన కొల్లి వెంకటలక్ష్మి మధ్య తరగతికి చెందిన మహిళ. ప్రభుత్వం అమలు చేసిన చేయూత లబ్ధిదారులగా ఉంది. ఏడాదికి రూ 18750 ఆర్థిక సాయం ఆమెకు పారదర్శకంగా అందడంతో ఆ సొమ్ముతో బట్టల వ్యాపారం చేస్తూ మంచి ఉపాధి పొందుతుంది. చేయూత మూడు విడతల సాయం 56,250 రూపాయలను తన వ్యాపారానికి పెట్టుబడిగా వినియోగించుకుంది. బట్టల వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆమె కుటుంబ ఆసరాలకు ఉపయోగించుకుంటుంది. ఆమె నాలుగో విడత చేయూత ఆర్థిక సాయంతో మొత్తం 75 వేలు సాయం పొందింది. గతంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడిన వెంకటలక్ష్మీ నేడు చేయూత సాయంతో బట్టల వ్యాపారిగా మారింది.

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



దువ్వలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరివెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం సాయంత్రం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా దువ్వ గ్రామ సచివాలయంలో వెలుగు, ఐకేపీ, డ్వాక్రా, మహిళా అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా అన్ని నామినేటెడ్ పదవులలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని చెప్పారు. మహిళలకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు మంత్రి కారుమూరి బహుమతులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, ఎంపీడీఓ శ్రీలలిత పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ... ముగ్గురి మృతి

మరొకరికి ఒకరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచిన మృతులు



రొక్కాల అభిరాం | చచలవాడ ఆనంద్ | చుక్కా దుర్గారావు

పెనుగొండ: ఆచంట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందగా, ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా వేగంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో ఆచంట గొల్లపల్లివాని చెరువుకు చెందిన రొక్కాల అభిరాం (25), ఆచంట పెదపేటకు చెందిన చదలవాడ ఆనంద్ (25), పోడూరు మండలం పండితవిల్లూరుకు చెందిన చుక్కా దుర్గారావు (28) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన పీతాని సాయి (28) తీవ్ర గాయాల పాలయ్యాడు. బైక్‌పై రొక్కాల అభిరాం డ్రైవ్ చేస్తుండగా చదలవాడ ఆనంద్ వెనుక కూర్చుని మార్టేరు వైపు నుంచి ఆచంట వైపు, మరో బైక్‌పై చుక్కా దుర్గారావు డ్రైవ్ చేస్తుండగా పితాని సాయి వెనుక కూర్చొని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రెండు మోటారు సైకిళ్లు అతి వేగంగా ఢీకొనడంతో మోటారు సైకిళ్లు సైతం గాలిలోకి లేచి దూరంగా పడ్డాయి. వీరికి తీవ్ర గాయాలవ్వడంతో పోలీసులు వచ్చే లోపే ముగ్గురు ప్రాణాలు విడిచారు. ప్రాణాలతో ఉన్న పితాని సాయిని పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు. ఆచంటకు చెందిన రొక్కాల అభిరాం తండ్రి శ్రీను పక్షవాతం బారిన పడి ఇంటివద్దనే ఉంటున్నాడు. తల్లి కుటుంబ పోషణ నిమిత్తం ఇతర దేశాలకు జీవనోపాధి నిమిత్తం వెళ్లింది. అవివాహితుడైన అభిరాంకు చెల్లి ఉంది. చదలవాడ ఆనంద్ తల్లి సైతం జీవనోపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లింది. అతను తమ్ముడితో కలిసి ఆచంట పెదపేటలో ఉంటున్నాడు. ఆచంటకు చెందిన ఇద్దరు మృతి చెందడంతోనా గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. పోడూరు మండలం పండితవిల్లూరుకు చెందిన చుక్కా దుర్గారావు కొబ్బరి దింపు కార్మికుడు. ఐదేళ్ల క్రితం వివాహం కాగా, నాలుగేళ్ల చిన్నారి సంతానం. ఆచంట ఉత్సవాలు తిలకించడానికి వెళ్లి తిరిగి వస్తారని ఎదురు చూస్తుండగా మరణవార్త వినాల్సి వచ్చిందంటూ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుగొండ సీఐ నక్కా రజనీకుమార్, ఆచంట ఎస్సై రాజ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరుగా ఈరంకి



ఈరంకి కాశీ విశ్వనాథం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఈరంకి కాశీ విశ్వనాథాన్ని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఐదేళ్లలో జిల్లాలో తొలిసారిగా బ్రాహ్మణ కార్పొరేషన్ పదవి పాలకొల్లుకి చెందిన కాశీకి దక్కింది. కాశీ గతంలో ఏపీ బ్రాహ్మణ పురోహిత సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం ఆ సంఘానికి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, గాయత్రి స్మార్త పురోహిత సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీగా పనిచే శారు. తన సేవలను గుర్తించి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)కు ఈరంకి కాశీ కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నూజివీడు/ముసునూరు: పట్టణలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ (సెబ్)పరిధిలోని ముసునూరు మండలం బలివేలో అక్రమంగా విక్రయిస్తున్న 51 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. బలివేలోని శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నూజివీడు పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన పాస్తం నాగరాజు(34) అనే అతను మద్యాన్ని విక్రయిస్తుండగా సెబ్ సిబ్బంది పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా నృసింహ మహాయజ్ఞం



శ్రీ లక్ష్మీనారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్న నరసింహ గురూజీ



లక్ష బిల్వార్చన చేస్తున్న రుత్వికులు

ద్వారకాతిరుమల : ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రంలో శ్రీ రుద్ర సుదర్శన సహిత నృసింహ 30వ మహా యజ్ఞం శుక్రవారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. సుదర్శన సంపుటితమైన 17 వేల రుద్రనామాలతో 1,331 కలశాలకు రుద్రపూజను ఘనంగా జరిపారు. ప్రతి ఏటా మాదిరిగా హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురుజీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన రుత్వికులు పాల్గొని, ఈ యజ్ఞ క్రతువును వైభవోపేతంగా నిర్వహించారు. స్వయంభూ శ్రీ లక్ష్మీ నారసింహునికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందని పండితులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో జరిగిన పలు కార్యక్రమాలతో సుందరగిరి పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధనలు, అనంతరం శాలిగ్రామ అభిషేకం, రుద్ర పారాయణ, చతుర్వేద పారాయణ, శ్రీ విష్ణు సహస్రనామ, లక్ష్మీ సహస్రనామ పారాయణలు, సూర్య నమస్కారాలను రుత్వికులు వేడుకగా జరిపారు. ఆ తర్వాత 1,331 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశారాధన, విగ్రహ సుదర్శన ప్రతిష్ఠలు, అగ్ని ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు వైభవంగా చేశారు. అనంతరం మహా యజ్ఞాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ రుత్వికులు తెల్లవార్లూ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో పేద విద్యార్థులు

- విద్యాహక్కు చట్టం ద్వారా ఉచిత విద్య
- 25 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- ఒక్కో స్కూల్లో 25 శాతం ప్రవేశాలకు అవకాశం



ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు

భీమవరం: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించాలనుకునే పేదలకు ఫీజుల భారం లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం ప్రభుత్వం కల్పించింది. విద్యా, ఉపాధి రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు సైతం ప్రైవేట్ స్కూల్స్‌లో ఉచిత విద్యను అందించేందుకు గత రెండేళ్లుగా కీలక చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేరే విద్యార్థులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా పూర్తిగా ప్రభుత్వమే ఫీజులు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో 383 ప్రైవేట్ పాఠశాలలు

జిల్లాలో 383 ప్రైవేట్ పాఠశాలల్లోని సీట్లసంఖ్యలో 25 శాతం ప్రభుత్వం కల్పించే ఉచిత విద్యకు సీట్లు కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కల్పించే ఉచిత విద్యను పొందడానికి ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. 5 ఏళ్ల నిండి ఆరేళ్ల లోపు పిల్లలకు మాత్రమే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్–12(1),(సి)ని అనుసరించి 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను ఆడ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితకుటుంబంలోని పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నిబంధనలు ఇలా

ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రవేశం లభించాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.14 లక్షలుగా నిర్ణయించారు. ప్రవేశం కల్పించే స్కూల్స్ యాజమాన్యాలకు అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్ కు రూ.5 వేలు, రూరల్ పరిధిలో రూ.6,500 ఫీజును ప్రభుత్వం నిర్ణయించగా ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుండగా ప్రైవేటు స్కూళ్లకు ఎంపికై న విద్యార్థులకు అమ్మఒడి డబ్బుల్లోనే ఫీజు చెల్లించి మిగిలిన మొత్తాన్ని విద్యార్థి తల్లి లేదా సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

ప్రైవేట్ పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు ఈనెల 25 వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. విద్యార్థులు నివాస ఉండే ప్రాంతం నుంచి కిలో మీటరు దూరంలో ఉన్న పాఠశాలలకు సీట్లు కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు.

పటిష్టంగా విద్యాహక్కు చట్టం అమలు



జిల్లాలో విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నాం. ఈ చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేరికకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 25 వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అవకాశం ఉంది. ప్రైవేట్ విద్యాసంస్థలో విద్యనభ్యసించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

ఆర్వో వాటర్ ఫిల్టర్ సిస్టం బహూకరణ


తణుకులో బాలికల వసతిగృహానికి వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న దాతలు

తణుకు: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తణుకు సాధారణ బీమా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తణుకు పాతఊరులోని బాలికల సంక్షేమ వసతి గృహానికి సుమారు రూ. 30 వేలు విలువైన ఆర్వో వాటర్ ఫిల్టర్ సిస్టమ్ ను అందజేశారు. పెన్షనర్ల అసోసియేషన్ మహిళా విభాగం నాయకులు పినిశెట్టి సత్యవతి, ప్రముఖ సామాజికవేత్త జి.ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ మేరీకమలరత్నంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు ఏఎస్వీ శేషుబాబు, టి.రాఘవేంద్రరావు, డి.సీతారామయ్య, నాళం దివ్య, హారిక, కనకదుర్గ, ఆకుల జ్యోతి, చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపాకలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


మండపాకలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, తదితరులు

తణుకు టౌన్: వేసవి కాలంలో విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో అధనపు విద్యుత్ ట్రాన్సఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తణుకు విద్యుత్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్సఫార్మర్‌ను మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఏర్పడకుండా ముందు జాగ్రత్తలో భాగంగా అవసరం ఉన్న చోట్ల అదనపు ట్రాన్సఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈలు టీ పెద్దిరాజు, నాయకులు పెండ్యాల మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాలతో కవాతు


తణుకు పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

తణుకు: రాబోయే ఎన్నికలు నేపథ్యంలో తణుకు నియోజకవర్గంలో ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశంతో పారామిలటరీ, సీఐఎస్ఎఫ్ బలగాలతో శుక్రవారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, పట్టణ సీఐ ఎం.నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రాంతంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఉండ్రాజవరం జంక్షన్ నుంచి ప్రారంభమైన కవాతు మున్సిపల్ కార్యాలయం, నరేంద్రసెంటర్, రాష్ట్రపతి రోడ్డు, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, పాతవూరు, ఇరగవరం కాలనీల్లో సాయుధబలగాలు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు కె.శ్రీనివాస్, ఎం.అప్పారావు, ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా బైరాగిమఠం కల్యాణ మండపం పనులు


బైరామఠంలో కల్యాణ మండపం శ్లాబ్ పనులు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: దేవాదాయ శాఖ ద్వారా అందించిన రూ. 1 కోటి నిధులతో కె. పెంటపాడు బైరాగిమఠం కల్యాణ మండపం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సుమారు 600 మీటర్ల మేర శ్లాబ్ పనులను ఈవో ఎ. రవిశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో కె. పెంటపాడులో ప్రజల కోరిక మేరకు కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే శ్రీరామ నవమినాటికి పనులు 90 శాతం పూర్తవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎస్ రాజ్‌కుమార్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

అత్తిలి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. అత్తిలిలో ప్రసిద్ధి గాంచిన శ్రీఉమా సిద్ధేశ్వరస్వామివారికి తెల్లవారు జామున అభిషేకం, మధ్యాహ్నం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి పాశుపతి సహిత ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా అఖండ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ బండి అంజన్న, ఈవో ఆకుల వెంకట నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అత్తిలి కుమ్మర వీధిలోగల శ్రీసోమేశ్వరస్వామి వారి ఆలయంలో తెల్లవారు జాము నుంచి స్వామివారి దర్శనం, అభిషేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

తణుకు టౌన్: మహా శివరాత్రి వేడుకలు తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తణుకు మండలం తేతలి, దువ్వ, వేల్పూరు, మండపాక, కొమరవరం, కోనాల గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా గురువారం రాత్రి స్వామి వార్ల కల్యాణోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి దర్శనం, అభిషేకాలు నిర్వహించారు. తేతలి గ్రామంలోని శ్రీ రాజ రాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం గ్రామాల్లో స్వామివారి రథయాత్రలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్త జనసంద్రమైన వీరంపాలెం శైవక్షేత్రం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ ఆధ్యాత్మిక పీఠం శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తజనసంద్రమైంది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారి ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరుడిని, స్పటిక లింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. తొలుత పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణశాస్త్రి, ఈమని శశికుమార్, గరిమెళ్ళ సందీప్, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో స్పటిక లింగానికి మానస సరోవర జలాలతోను, 12 రకాల నదీ జలాలు, 12 రకాల మంగళ ద్రవ్యాలతో మహాలింగానికి


తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శైవక్షేత్రంలోని విశ్వేశ్వరుడిని విశేషంగా అలంకరించిన దృశ్యం

అభిషేకాలు జరిపారు. మహాలింగానికి అభిషేకాల్లో హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావు, వైఎస్సార్ సీపీ యువనాయకుడు కొట్టు విశాల్ దంపతులు పాల్గొని, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుతీరి కనిపించారు. మహాశివరాత్రి పర్వ దినం సందర్భంగా గ్రామమంతా ఇసుకవేస్తే రాలనంతగా భక్తజనం పోటెత్తింది. అలాగే, భక్తుల శివనామస్మరణతో గ్రామం మార్మోగింది. రిటైర్డ్ హైకోర్టు జడ్జి కేసీ.బాబు, అడ్వకేట్ జనరల్ ప్రసాద్, రిటైర్డ్ సీబీఐ జడ్జి నాగమారుతీ శర్మ, జిల్లా ఎస్పీ అజిత, మాజీ ఎమ్మెల్యే యీలి నాని తదితరులు విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. కొయ్యలగూడెం మండలం గాంధీనగరానికి చెందిన హరే శ్రీనివాస భక్త బృందం కోలాట నృత్యప్రదర్శన నిర్వహించారు.

శివాలయాల్లో మంత్రి కారుమూరి ప్రత్యేక పూజలు

తణుకు అర్బన్: శివరాత్రి సందర్భంగా తణుకులోని పాతవూరు శ్రీఉమాసిద్ధేశ్వర స్వామి, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని శ్రీ కపర్దీశ్వరస్వామి ఆలయాల్లో వేంచేసియున్న శివన్నారాయణ స్వామిని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి కారుమూరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదములు స్వీకరించారు. పట్టణంలోని శివాలయాల వద్ద భక్తులు పోటెత్తారు. ఉమా సిద్దేశ్వరస్వామి ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, పార్టీ నాయకులు సంగిరెడ్డి శ్రీనివాస్, రంభ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అత్తిలి : విశేష అలంకరణలో శ్రీఉమాసిద్ధేశ్వరస్వామి


తాడేపల్లిగూడెం (టీఓసీ): శంకరమఠంలోని స్పటిక లింగం


తణుకు అర్బన్: మంత్రి కారుమూరికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు


తణుకు టౌన్: మహా శివరాత్రి సందర్భంగా తేతలిలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం రూరల్: స్వామి వారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు


పెంటపాడు: శివుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


తణుకు అర్బన్: కపర్దీశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

భారీ అన్నసమారాధన

తణుకు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని చరిత్ర కలిగిన శ్రీ కపర్దీశ్వరస్వామి ఆలయం వద్ద పూజాధికాల అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, సత్యశ్రీ దంపతుల ఆర్థిక సౌజన్యంతో రూ. 8 వేల మందికి భారీ అన్నసమారాధాన నిర్వహించారు. స్వయంభూగా వెలిసిన శివలింగం ఆలయంలో ప్రత్యేకమని తమ పూర్వీకుల నుంచి ఆలయంలో పూజాధికాలు నిర్వహిస్తున్నట్లుగా సుబ్బారావు చెప్పారు. ప్రతి ఏటా అన్నసమారాధన నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాతవూరులోని ప్రముఖులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామికి దివ్య కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వివిధ శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. శ్రీ భ్రమరాంభికా సమేత మల్లికార్జునస్వామి (పెద్ద శివాలయం), చిన్న శివాలయం, శ్రీ వాసవి కన్యకపరమేశ్వరీ ఆలయంలోని చంద్రశేఖర్‌స్వామికి, తాలూకా సెంటర్‌లో శివాలయం, హౌసింగ్‌బోర్డు శివారు శ్రీనవ దుర్గ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, జువ్వల పాలెం శివాలయం, శంకరమఠంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామికి స్పటిక లింగానికి మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు క్యూలైన్‌లలో స్వామి వార్లను దర్శించారు. అదే విధంగా ప్రజాపతి బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో 88వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు సందర్భంగా సహస్ర లింగ దివ్యదర్శనం, స్వయం ప్రకాశ శివలింగ దివ్యదర్శనంలు జరిగాయి. ఉచిత రాజయోగ శిక్షణలు జరిగాయి.

గ్రామాల్లో ఘనంగా శివరాత్రి పూజలు

పెంటపాడు: శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పలు గ్రామాలల్లో శివనామస్మరణ మార్మోగింది. ఈ సందర్భంగా పలు శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ప్రత్యేక అభిషేకాలు, పూజలు, రుద్ర హోమాలు, కుంకుమపూజలు అన్న సమారాధనలు, జ్యోతిర్లింగార్చనలు నిర్వహించారు. పెంటపాడు పెద్దశివాలయంలో ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భక్తులు క్యూలైన్ లో వేసి యుండి స్వామివారి దర్శనాలు నిర్వహించారు. దర్శిపర్ర పార్వతి బ్రహ్మలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడ పాడు, పరిమెళ్ల రామలింగేశ్వస్వామి ఆలయంలో భారీ అన్నసమారాధనచేశారు. విప్పర్రు సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరరావు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం


మున్సిపల్ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు సత్కారం చేస్తున్న స్పిరిట్ సభ్యులు


తణుకులో మహిళా కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

తణుకు టౌన్: సమాజంలో మహిళల పాత్ర కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ కె రామకృష్ణ చెప్పారు. శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏదేశంలో స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంభన కలిగి ఉంటుందో ఆ దేశం అభివృద్ధి పథకంలో ఉంటుందన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలు ఆస్థాయిలో అవకాశాలను, అధికారాలను అందుకోవడం లేదన్నారు. ఇంకా అనేక రంగాల్లో మహిళలు సాధికారత సాధించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మహిళా కార్మికులకు లయన్స్‌క్లబ్ సభ్యులచే సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఆరుగురు పారిశుద్ధ్య మహిళా కార్మికులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. స్పిరిట్ అధ్యక్షురాలు నూకల జయభారతి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య మహిళా కార్మికులు సేవలు కీలకమైనవి, వెల కట్టలేనవని చెప్పారు. మహిళా కార్మికులు ధనాల లక్ష్మి, పెనుమాక కోటమ్మ, బంగారు మునలమ్మ, బాదంపూడి మరియమ్మ, కుమ్మిరాల నాగలక్ష్మి, గండేటి రామలక్ష్మిలకు సత్కారం చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్


పెంటపాడు: అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో పలువురు ప్రముఖులకు సన్మానాలు చేసిన మానవత సభ్యులు

పి.గోపాలరావు, స్పిరిట్ సభ్యులు నూకల నాగ మల్లేశ్వరరావు, బత్తుల ప్రసాద్, రంజిత్, మణికంఠ, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీమాన్నారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్యాంసురాలు కొలచన వెంకటలక్ష్మిదేవిని ఘనంగా సత్కరించారు. కార్యదర్శి కుంట్ల కనకదుర్గ, కోశాధికారి సీహెచ్ ఇందిరా కుమారి, మహిళా సభ్యులు హాజరైయారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మదన్‌మోహన్ అగర్వాల్, అనితా అగర్వాల్, అమ్రిత, రితీష్‌లు సహాయ సహకారాలతో పేద మహిళలకు ఉపాధి నిమిత్తం గ్రైండర్స్ పంపిణీ చేశారు. అధ్యక్షులు వంగపండు రామ్మోహన్‌రావు, చిన్నం జగదీష్, ఎల్ఎస్వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్య నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారతతోనే సమాజ సాధికారత సాధ్యమని వక్తలు చెప్పారు. అధికారులు ఏఎస్ పద్మావతమ్మ, సలోమి, కళాశాల అసోసియేట్ డీన్ మాధవి, పి.రమాదేవి సుజాత, క్రాంతి సుధ, పావని తదితరులు పాల్గొన్నారు. మహిళలకు క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నన్నయ్య ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్సు సెల్ డైరెక్టర్ వి.పెర్సిస్సు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో మిస్ ఇండియా ఎర్త్ డాక్టర్ తేజస్విని మనోజ్ఞ సందడి చేశారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

తణుకు: మహిళల అణచివేతను ప్రతిఘటిస్తూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సమానత్వ సాధన దిశగా శ్రమకు తగిన వేతనం, నిర్దిత పని గంటలకు శ్రామిక మహిళలు సాగించిన మహత్తర ఉద్యమ పోరాటాల ఫలితమే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవమని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తణుకు సురాజ్య భవన్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో పుష్పకుమారి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా తణుకు ఏపీ సీడ్స్‌లో మహిళా కార్మికులుగా పనిచేసి రిటైరైన పసుపులేటి దానమ్మ, శీలంశెట్టి సీతలను ఘనంగా సత్కరించారు. మహిళా సమాఖ్య తణుకు ఏరియా కార్యదర్శి వలవల అరుణ కుమారి, పిండి సత్యవతి, పి.రామలక్ష్మి, కృష్ణవేణి, జె.ఉమామహేశ్వరి, మేకా వెంకట లక్ష్మి, జొన్నల లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రధాన ధ్యేయం

పెంటపాడు: మహిళా సాధికారతే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం మానవత సంస్థ ఆధ్వర్యంలో 35 మంది మహిళలైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ సిబ్బంది, డాక్టర్లు స్థానిక వీణం వీరన్న ఆడిటోరియం వద్ద ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మగవారితో పోటీగా తాము ఎంచుకొన్న రంగాల్లో మహిళలు ప్రణాళికాబద్ధంగా కృషిచేయడం అభినందనీయమన్నారు. మానవత సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ పలు రంగాల్లో అతివల సేవలు ఎనలేవివన్నారు. మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, మానవత మండల అధ్యక్షుడు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, తారాడి పాల్, ఏలూరి వీరాస్వామి, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, కిందస్థాయి మహిళా ఉద్యోగినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: యువత విద్య, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపా రు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణం గీతా ఫంక్షన్ హాల్‌లో ఏపీ గ్లోబల్ ఇన్‌ఫామ్ (జిమ్) రీజనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మాక్ వ్యవస్థాపకులు డాక్టర్ జయరాజు మాట్లాడుతూ విద్య, ఆర్థిక, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలనేది «జిమ్» ముఖ్యోద్దేశ్యమని తెలిపారు. రాజకీయాలకు, మతాలకు, సంస్థలకు సంబంధించినది కాదని పేర్కొన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వారంతా గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మాక్‌లో సభ్యులని, జిమ్ సభ్యులుగా ఉండటం గర్వంగా భావించాలన్నారు. జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలు అవసరమన్నారు. గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రల ద్వారా యువతలో ఉత్తేజాన్ని నింపాలన్నారు. తద్వారా తమంతట తాము అవకాశాలు కల్పించుకోవడం, సృష్టించడం, జరుగుతుందన్నారు. విజ్ఞానం, ఉత్సాహంతో పాటు మిగిలిన వారితో అనుబంధంతో ఉండాలన్నారు. నెట్ వర్క్ ఈజ్ యువర్ నెట్ వర్త్ అని పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్‌ఫార్మ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ శిఖామణి మాట్లాడుతూ మాదిగల్లో ఐపీఎస్, ఐఏఎస్ వంటి ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఉన్నారన్నారు. యువతను మంచి మార్గంలో తీసుకెళ్లడే జిమ్ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా జిల్లా, రాష్ట్ర కమిటీలపై చర్చించనున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లా కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి రాజబాబు ప్రోగ్రామ్ కన్వీనర్ తెన్నేటి జగజ్జీవన్, వీరయ్య, జాలపర్తి సురేష్, తిగిరిపల్లి సుబ్బారావు, తెన్నేటి విక్రాంత్ పాల్గొన్నారు.

13న గోయెంకాలో మెగా జాబ్‌మేళా

పెంటపాడు: ఈనెల 13న పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వర రావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్. ఇందిరమ్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలకు అపోలో ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, అరబిందో ఫార్మా, హెటిరోలాబ్స్, ఆస్ట్రోటెక్, తదితర పేరెన్నికన్న కంపెనీ ప్రతినిధులు పదో తరగతి నుంచి ఇంజనీరింగ్ విభాగం వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి జాబ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రతినిధులు కోరారు.

ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు

తణుకు టౌన్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి గృహ సారథులు, బూత్ కన్వీనర్లు సైనికుల్లా పని చేయాలని మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని మొత్తం 15 బూత్‌ల బూత్‌స్థాయి నాయకులు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులతో ఎన్నికలను నేను సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహఇంచారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన గ్రామాల్లో అనుసరించవలసిన అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రచారం, బూత్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బూత్ కన్వీనర్ల నుంచి సూచనలు తీసుకున్నారు. ఈ సమావేశానికి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండల జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, గ్రామ సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, విజయ దుర్గ, రెడ్డి మణికంఠ, కర్రెళ్ల ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో శ్రీ యల్లారమ్మ, శ్రీ కేశవ స్వామి ఆలయాల నూతన కమిటీల చైర్మన్‌లు, సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. ఆలయ ఈవో ఎం. వెంకట్రావు ఆలయాల చైర్మన్‌లు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన ఆలయ కమిటీల సభ్యులను అభినందించారు. శ్రీ యల్లారమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా పెండ్యాల మణికంఠ, శ్రీ కేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సబ్బవరపు రామారావులు, శ్రీ యల్లారమ్మ ఆలయ కమిటీ సభ్యులుగా పరిమి శివసాయి ప్రసాద్, బీమవరపు వీర్రాజు, విడివాడ కృష్ణవేణి, కడలి శ్రీలక్ష్మీ, వేల్పూరి సుబ్బలక్ష్మీ, కోరాటి చినలక్ష్మీ, ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొండవీటి అయ్యప్ప కృష్ణలు ప్రమాణస్వీకారం చేశారు. శ్రీ కేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులుగా బలుసు హేమ మహేశ్వరరావు, బీమవరపు విమానదాసు, కంకటాల లక్ష్మీ, పిచుకల వెంకట పద్మావతి లక్ష్మీ నరసమ్మ, తాటిపర్తి అంజలి, మారిశెట్టి దేవి, అర్చక, ఎక్స్ అఫీషియో సభ్యులుగా పీవీ సత్యానారాయణాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయాల కమిటీ చైర్మన్‌లు, సభ్యులుగా ఎన్నికైన వారందరికీ సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, తదితరులు అభినందించారు.